చెదరగొట్టాలి.. మళ్లీ పేర్చాలి..!

- నగరాభివృద్ధిపై రేవంత్ సర్కారు విచిత్ర క్రీడ
- ఏడాది దాటినా ఇప్పటికీ మొదలుకాని తట్టెడు పని
- కేసీఆర్ హయాంలోని ప్రతిపాదనలతోనే కొత్త పేర్లతో ప్రాజెక్టులు
- నయాపైసా విదల్చలేని స్థితిలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోతున్న తమకు భూమితో పాటు ఇంటికి నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బొల్లారం నుంచి లక్డావాలా బస్టాప్ వరకు ర్యాలీ తీసిన స్థానికులు. – బొల్లారం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): సాధారణంగా పిల్లలు ఆడుకునేటప్పుడు రాళ్లను గుట్టగా పేరుస్తారు..అన్నీ పేర్చిన తర్వాత వాటిని చెదరగొడతారు! మళ్లీ తిరిగి పేరుస్తారు!! వాళ్లకు అదో సరదా. గతేడాదిగా హైదరాబాద్ మహానగరాభివృద్ధిపై రేవంత్ సర్కారు తీరు ఇట్లనే కనిపిస్తున్నది. ఏ విభాగాన్ని పట్టుకున్నా... తొలుత దానికి సంబంధించి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూపొందించి, అమలైన ప్రతిపాదనలను చెదరగొడుతున్నారు..కొన్ని రద్దు చేస్తున్నారు..తిరిగి పాత పనులతోనే కొత్త ప్రతిపాదనలు రూపొందించి నూతనంగా నామకరణం చేస్తున్నారు. తాజాగా రమారమి రూ. 80-90 వేల కోట్ల ప్రతిపాదనలతో సీఎం సహా పలు విభాగాల అధికారుల హడావిడి మళ్లీ మొదలుపెట్టారు. ఇందులో కేంద్రం వాటాగా వేల కోట్లను ప్రతిపాదించినా ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో చిల్లిగవ్వ కేటాయింపు లేదు. మరోవైపు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి ఖజానాలు కూడా ఖాళీగా ఉండటంతో నిధుల సమీకరణ అనేది మిలయన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

కొత్త సీసాలో పాత సారానే...

◆ దశాబ్దాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నగరంలోని రవాణా వ్యవస్థలో వేళ్ల మీద లెక్కించేంత మౌలిక సదుపాయాలు వచ్చాయి. కానీ గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాలు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలను పొందాయి. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) మొదటి దశ కింద సుమారు రూ.6800 కోట్లతో చేపట్టిన పనుల్లో దాదాపు 35కు పైగా ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, తీగల వంతెన... ఇలా ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఇంకోవైపు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వందల కిలోమీటర్ల లింకు, కొత్త రోడ్ల నిర్మాణంతో నగరం నలుమూలలా ముఖచిత్రమే మారిపోయింది. ఈ నేపథ్యంలో ఎస్ఆర్‌డీపీ రెండో దశ కింద కూడా కేసీఆర్ ప్రభుత్వం వేలాది కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. కానీ అధికారంలో వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు ఒత్తిడిని అధిగమించేందుకు రూ.20వేల కోట్ల నిధుల సమీకరణ చేయాలనే దానిపై కన్సెల్టెంట్లతో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతున్నది.

సుంకిశాలను ముంచి..

రూ.1006 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి నగరానికి పది టీఎంసీల గోదావరిజలాలు వచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం డిజైన్ రూపొందిస్తే... రేవంత్ సర్కారు దాని డిజైన్ మార్చి అదనంగా 26 కిలోమీటర్ల పైప్‌లైన్ పెంచి మల్లన్నసాగర్ నుంచి నీటి సేకరణకు నిర్ణయించింది. తద్వారా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7300 కోట్లకు ఎగబాకింది.

ఎలివేటెడ్ ప్రాజెక్టు...

ప్యారడైజ్-డెయిరీ ఫాం రోడ్డు (5.8 కిలోమీటర్లు), జేబీఎస్ - తూంకుంట (18 కిలోమీటర్లు) ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును రూపొందించారు. కానీ కేంద్రంలోని మోదీ సర్కారు రక్షణ భూములకు క్లియరెన్స్ ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేసింది. గతేడాది జనవరి 24న రక్షణ శాఖ నుంచి అనుమతులొచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హడావిడిగా ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేకపోయారు.

కేబీఆర్ పార్కు దాటేదెలా?

కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ చిక్కుముళ్లు లేకుండా ప్రయాణించేందుకు కేసీఆర్ ప్రభుత్వమే గతంలో ఎస్ఆర్‌డీపీ కింద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ పర్యావరణ అనుమతుల చిక్కుతో పాటు స్థానికులు కూడా వ్యతిరేకించడంతో ఆ ప్రాజెక్టు ముందుకు కదలలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్నిరోజుల కిందటటేడు చొప్పున అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లను నిర్మించేందుకు నిర్ణయించింది. జీహెచ్ఎంసీ భూసేకరణ పూర్తి చేస్తే రూ.1090 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని అనుకున్నారు. అయితే భూసేకరణకు సర్వే మొదలైంది. భూసేకరణ పూర్తి చేయడం ఒక చిక్కయితే... గతంలో నష్టపరిహారం కింద జీహెచ్ఎంసీ టీడీఆర్‌లు (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ఇచ్చేది. కానీ ఏడాది కాలంగా రియల్, నిర్మాణ రంగాలు దెబ్బతినడంతో టీడీఆర్‌లకు డిమాండు తగ్గింది. ఎలివేటెడ్ కారిడార్‌లోనే బాధితులు టీడీఆర్‌లకు విముఖత చూపడంతో హెచ్ఎండీఏ నగదు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో ఈ ప్రాజెక్టులో జీహెచ్ఎంసీ నగదు ఇవ్వాలంటే అది సాధ్యమేనా? జీతభత్యాలు, నిర్వహణకే సతమతం అవుతున్న జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.వెయ్యి కోట్ల బకాయిలనే ఇవ్వలేక పోతున్నది.

మీరాలం వంతెన చేపట్టేదెవరు?

మీరాలం చెరువు అభివృద్ధితో పాటు దుర్గం చెరువులా తీగల వంతెన ప్రాజెక్టు ప్రతిపాదనలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉన్నాయి. దీనిపై ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హడావిడి మొదలుపెట్టింది. అయితే దీనిని ఏ విభాగం చేపడుతుందనే దానిపై అధికారుల్లోనే అయోమయం నెలకొంది.

బాండ్లపైనే హెచ్ఎండీఏ ఆశలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.150 కోట్ల ఆదాయంతో వేలాది కోట్ల అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమైన హెచ్ఎండీఏ ఇప్పుడు నిధులులేక విలవిలలాడుతున్నది. రియల్, నిర్మాణ రంగం పడిపోయి ఆదాయం నెలకు రూ.60-70 కోట్లకు మించకపోవడంతో అది నిర్వహణకే సరిపోతున్నది.

మెట్రో పయనమెటు..?

హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం గత పదేండ్లలో రోడ్డు నెట్‌వర్క్‌ను గణనీయంగా మెరుగుపరిచిన తర్వాత మెట్రోపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా 2023 ఆగస్టులో జరిగిన మంత్రవర్గ సమావేశంలో నూ.60వేల కోట్లతో 309 కిలోమీటర్ల ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రానున్న 2-3 సంవత్సరాల్లో వీటిని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ఎంచుకుంది. అప్పటికే రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోను ప్రారంభించింది. జీఎమ్మార్, హెచ్ఎండీఏ, ఎల్అండ్‌టీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.6250 కోట్లతో 31 కిలోమీటర్ల చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో సర్వే కూడా మొదలైంది.

◆ కానీ 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే రాయదుర్గం ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేసింది. దీంతో దానిపై అప్పటివరకు వెచ్చించిన కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలు ఉండొద్దనే ఆలోచనతో రేవంత్ సర్కారు మళ్లీ మెట్రో ప్రతిపాదనలపై మల్లగుల్లాలు మొదలుపెట్టింది.

◆ ఎట్టకేలకు రెండో దశలో నాలుగు మార్గాల్లో 68.9 కిలోమీటర్ల మెట్రోకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ రూపొందించి, కేంద్రానికి పంపింది. ఇప్పటివరకు కేంద్రంలో డీపీఆర్ పరిశీలననే పూర్తి కాలేదు. పైగా మోదీ సర్కారు ఇటీవలి బడ్జెట్‌లో ఈ ఊసే ఎత్తకపోవడంతో కేంద్రం నుంచి వస్తుందనుకున్న రూ.4,368 కోట్లపై ఆశలు ఆవిరయ్యాయి. పైగా కేంద్రం సాంకేతిక అనుమతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రూ.11689 కోట్లు (48 శాతం) రుణానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రోను గత ఒప్పందం మేరకు చేపట్టేందుకు ఎల్అండ్‌టీ నిరాకరించడంతో రూ.2741 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వమే మొదలుపెట్టింది. ఇప్పుడది భూసేకరణ దశలోనే ఉంది. కేంద్రం మొండిచేయి చూపడం, పీపీపీకి ఎల్అండ్‌టీ నిరాకరించడంతో రాష్ట్రమే మొత్తం భరించాల్సి ఉంది.

◆ శంషాబాద్ నుంచి ఫోర్త్ సిటీ మెట్రో అంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో 40.318 కిలోమీటర్ల ప్రతిపాదనలు, మేడ్చల్ మెట్రో కింద ఇంకో 45 కిలోమీటర్ల (జేబీఎస్-శామీర్‌పేట, జేబీఎస్-మేడ్చల్) ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. రెండో దశ అంచనాల ప్రకారం లెక్కిస్తే కిలోమీటరకు రూ.318 కోట్లు అవుతున్నందున... మూడో దశలోని 85.318 కిలోమీటర్లకు రూ.25,541 కోట్ల వరకు అవుతుంది. అంటే కేవలం మెట్రో ప్రాజెక్టులపైనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.50వేల కోట్ల వరకు ప్రతిపాదనలను ముందు పెట్టుకుంది. ఏడాది గడిచినప్పటికీ ఇప్పటివరకైతే పాతబస్తీ మెట్రో భూసేకరణ మినహా ఎక్కడా కించిత్తు కదలిక లేదు.

ఫార్మాసిటీ ఉన్నట్టా..లేనట్టా..?

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 9 : కందుకూరులో ఫార్మాసిటీ ఉన్నట్లా లేనట్లా..? అనేది ప్రభుత్వం స్పష్టం చేయాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీలో ఆదివారం ఆమె సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14000 ఎకరాలను సేకరించి పెట్టిందన్నారు. అయితే ఫార్మాసిటీని కాదని ఫోర్త్‌సిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నదని, ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలంలో ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం చెబుతున్నారన్నారు. కొడంగల్‌లో మరో వెయ్యి ఎకరాలు ఎందుకోసం తీసుకుంటున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. కొడంగల్ రైతుల సమస్యపై ఇప్పటివరకూ ముఖ్యమంత్రి పిలిచి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, అశోక్, ముత్యాల కృష్ణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఫార్మాసిటీ పై కాంగ్రెస్ డబుల్ గేమ్..

- రైతులను మభ్యపెట్టి.. పబ్బం గడుపుకొంటున్నది..
- ఆ పార్టీ నాయకులకు దమ్ముంటే రైతులకు భూములు ఇప్పించాలి
- లేదంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి
- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సవాల్
- మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)/ యాచారం : ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతున్నదని..మొదటి నుంచి రైతులను మభ్యపెట్టి.. పబ్బం గడుపుకొంటున్నదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలోని సాయిశరణం ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండలాధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. దీనికి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకిచ్చి మాట నిలబెట్టుకోవాలని సవాల్ విసిరారు. లేదంటే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం వారికి పరిహారం చెల్లించాలన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా గత ప్రభుత్వం ఫార్మా భూబాధితులకు ఇచ్చిన ప్లాట్లను నేటికీ ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని రైతులకు చెప్పిన రేవంత్ సర్కార్ హైకోర్టులో మాత్రం మేము ఫార్మాసిటీ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నాలుగు గ్రామాల్లోని 2,200 ఎకరాలకు సంబంధించిన భూమిని టీఎస్ఐఐసీ నుంచి వెంటనే రైతుల పేరిట ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రైతులను నమ్మించిన భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, కోదండరాం, కోదండరెడ్డి, తీన్మార్ మల్లన్నలు నేడు రైతులు ఆందోళనలు చేస్తుంటే ఎక్కడ దాక్కున్నారని మండిపడ్డారు. ఫార్మా బాధిత రైతులకు బీఆర్ఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. మొండిగౌరెల్లిలో మైనింగ్ జోన్ వద్దన్న కాంగ్రెస్ నేడు అనుమతులివ్వాలని చూస్తున్నదని.. అక్కడికి దానిని రానిచ్చే ప్రసక్తే లేదన్నారు.

పదేండ్ల అభివృద్ధి వెనక్కి..

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్న దని మంచిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ 14 నెలల పాలనలో పదేండ్ల అభివృద్ధి వెనక్కి పోయిందని, హామీల అమల్లో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు రేవంత్‌రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారులు, పోలీసులను బెదిరించి పనులు చేయించుకుంటున్నారని.. ఇప్పటికే మమ్మూళ్ల విషయంలో ఇబ్రహీంపట్నంలో ఎనిమిది మంది సీఐలను మార్చినట్లు ఆయన ఆరోపించారు. పార్టీకి కార్యకర్తలే పట్టు కొమ్మలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని, బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై ప్రతి గ్రామంలోనూ విస్తృత స్థాయి సమావేశాలను నిర్వహించి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాలన్నారు. రానున్నది గులాబీ సర్కారేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారింగు యాదయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, సహకార సంఘం డైరెక్టర్లు స్వరూప, శశికళ, కళమ్మ, మాజీ సర్పంచ్‌లు రాజూనాయక్, జగదీశ్, కృష్ణ, హబీబుద్దీన్, బోడ కృష్ణ, నాయకులు యాదయ్య, నర్సింహారెడ్డి, పరికిష్‌రెడ్డి, ఖాజు, యాదయ్యగౌడ్, శివ, గోపాల్, వెంకటేశ్, శంకర్‌నాయక్, లోహిత్ రెడ్డి, గణేశ్, మహేశ్, జానీ, జర్కోని రాజు, శేఖర్, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు నాయకులు

కాంగ్రెస్‌వి ఉత్తుత్తి హామీలు

బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. హస్తం పార్టీ ఉత్తుత్తి హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. దీనిని ప్రజలు తొందరగా అర్థం చేసుకోని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. త్వరలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక రానున్నదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడి పని చేయాలన్నారు. ఎన్నిక ఎప్పుడొచ్చినా శ్రేణులు ఉండాలని సూచించారు. బీఆర్ఎస్‌లో అందరికీ సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, వెంకటేశ్, రాముయాదవ్, రఘుయాదవ్, వెంకటేశ్, సోమ శ్రీనివాస్, అరుణ్‌ముదిరాజ్, రమేశ్, రాజు, మంచర్ల చిరంజీవి, సురేశ్‌ముదిరాజ్, గంజి రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

పాన్ మసాలా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

జీఎస్టీ బిల్లు ఉండడంతో తిరిగి ఇచ్చేసిన పోలీసులు

తాండూరు, ఫిబ్రవరి 9 : తాండూరు పట్టణంలో ఆదివారం పాన్‌మసాలా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రూ. 35 లక్షల విలువైన పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని తాండూరు పోలీసులకు అప్పగించారు. దన్‌గర్‌గల్లీలోని కిరాణా వ్యాపారి రామకృష్ణ దగ్గర పాన్ మసాలాలకు సంబంధించిన జీఎస్టీ బిల్లు ఉండడంతో తిరిగి తాండూరు పోలీసులు అతడికి అప్పగించినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్‌కు పక్కా సమాచారం ఉంటేనే రంగంలోకి దిగి పట్టుకుంటుందని.. అంత పెద్ద మొత్తంలో పట్టుకున్న పాన్ మసాలా ప్యాకెట్లను తిరిగి వ్యాపారికి అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు పట్టుకొని వదిలేసిన పాన్‌మసాలా బ్యాగులు

గ్రేటర్‌లో పర్యటించిన బల్దియా కమిషనర్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మెరుగైన రవాణా సౌకర్యం కొరకు హెచ్‌సిటీ ద్వారా పలు ప్రాంతాల్లో ప్రతిపాదించి చేపట్టనున్న ఫ్లై ఓవర్ పనులను చేపట్టేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పరిశీలించారు. ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారణకు హెచ్‌సిటి ద్వారా మొదటి ప్రాధాన్యత ఇచ్చి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదివారం ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తయ్యేవరకు భూసేకరణ పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన కమిషనర్ ఇలంబర్తి సూచించారు. నానా నగర్, ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ, డీఎల్ఎఫ్, విప్రో, సరోజినీదేవి హాస్పిటల్ నుంచి ఖైరతాబాద్ వరకు వయా బంజారాహిల్స్ రోడ్డు నం.1, చింతల్ బస్తీ మీదుగా రోడ్డు వెడల్పు ఫీసిబిలిటీ, ప్రతిపాదించిన జంక్షన్ల వద్ద టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ ప్రాజెక్టు అధికారులతో కమిషనర్ పరిశీలించారు.

నగరంలో మెరుగైన రవాణాకు చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): హెచ్-సిటీ ద్వారా చేపట్టే ప్రాజెక్టుతో నగర పౌరులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగేలా పనులు చేపట్టాలని, ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరి, సౌకర్యవంతంగా ఉండేలా ప్రాజెక్టులను తీర్చిదిద్దాలని ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులను సూచించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ప్రాజెక్ట్ (హెచ్-సిటీ) పనులపై ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, సిటీ ప్లానర్లతో ఆదివారం సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రహదారులను మెరుగుపర్చాలి

హెచ్-సిటీ ప్రాజెక్టుతో హైదరాబాద్ నగరానికి ప్రధాన సమస్యగా మారిన రహదారులను మెరుగుపరచాలన్నారు. గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలను తొలగించేలా, వరద ముంపును తప్పించేలా, నగరం నలుమూలలా ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్యూబీ, ఆర్వోబీలను రూ. 7,300 కోట్లతో 50 పనులను హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు దశల్లో నిర్మిస్తుందన్నారు. మొదటి విడతగా రూ. 2100 కోట్లతో పనులు చేపట్టగా, ఈ పనులపై సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేసినట్లుగా తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, సిటీ ప్లానర్లు బృందాలుగా ఏర్పడి గ్రేటర్ హైదరాబాద్ లో హెచ్ - సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్లు, రోడ్డు విస్తరణ, అభివృద్ధితో సహా అన్ని పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి లోతుగా అధ్యయనం చేయాలని ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. ఒక్కో జోన్ కు అదనపు కమిషనర్ లేదా జోనల్ కమిషనర్ నేతృత్వంలో క్షేత్ర పరిశీలన జరగాలన్నారు.

మన సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహా దర్శకుడు కె.విశ్వనాథ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 : మన సంస్కృతి, సంప్రదాయాలపై అనేక సినిమాలు రూపొందించిన మహా దర్శకుడు డాక్టర్ కే విశ్వనాథ్ అని తెలంగాణ తొలి శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ దర్శకుడు, పద్మశ్రీ కళా తపస్వి డాక్టర్ కె.విశ్వనాథ్ 93వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరికొండ మధుసూదనాచారి హాజరై విశ్వనాథ్ పురస్కారాన్ని అందాల నాట్యతార సబితకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతీసంప్రదాయాలపై విశ్వనాథ్ సినిమాలు తీయకపోతే మనమంతా పరాయీకరణకు గురయ్యే వారమని తెలిపారు.

తన సినిమాల ద్వారా మన సంస్కృతీసంప్రదాయాలను ప్రపంచానికి చాటిన మహా దర్శకుడు డాక్టర్ విశ్వనాథ్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేము సైతం యువసేన ఫౌండేషన్ నిర్వాకురాలు స్వప్నాశ్రీనివాస్, దైవజ్ఞ శర్మ నిర్వాహక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పుష్పలత సురేందర్, సినీ నిర్మాత మురళీధర్, సంఘ సేవకుడు వీర భోగ వసంత రాయులు భరతనాట్య, కూచిపూడి గురువులు శ్వేత ప్రియ, లావణ్య, కామేశ్వరి, ప్రతిభా రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఏల చేతిలో హెచ్ఎండీఏ ప్రణాళికలు

ఇప్పటికీ సందిగ్ధంగానే వారి పనివిధానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ ప్రణాళికలను పట్టాలెక్కించేందుకు నియమించిన ట్రాన్సాక్షన్ అడ్వయిజరీలు పనిచేస్తున్నాయా? లేదా అనేది సందిగ్ధంలో ఉంది. హెచ్ఎండీఏ చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ప్రణాళికల బాధ్యతలను సలహాదారులకు అప్పగించారు. ఇప్పటికే రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులతోపాటు, మీరాలం లేక్ కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టుల టెండర్ల విధానం, ఆర్థిక పరమైన అంశాలపై అధ్యయనం చేసేందుకు గతంలోనే టెండర్లను హెచ్ఎండీఏ పిలిచింది. అయితే ఇప్పటికే వాటి నియామాకం పూర్తి కాగా